

డిఆర్‌ఒగా విశ్వేశ్వరరావు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా రెవెన్యూ అధికారిగా వి.విశ్వేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్విని విశ్వేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిఆర్‌ఒకు అభినందనలు తెలిపారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్‌గా పని చేసిన వి.విశ్వేశ్వరరావు ఏలూరు డిఆర్‌ఒగా నియమితులయ్యారు.




కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న డిఆర్‌ఒ

'నేవీ ఆయుధ డిపో ఇక్కడ పెట్టొద్దు.. మమ్మల్ని ఇలా బతకనీయండి. ఇప్పటికే పలు ప్రాజెక్టుల పేరుతో అనేక గిరిజన కుటుంబాలు చిధ్రమయ్యాయి. గతంలో రెండుసార్లు వ్యతిరేకించడంతోపాటు గ్రామసభ తీర్మానం చేసినా, మళ్లీ గ్రామసభ నిర్వహించడం ఏమిటీ అంటూ జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో ఆయుధ డిపోను వ్యతిరేకిస్తూ సోమవారం జరిగిన గ్రామసభలో తీర్మానం చేశారు. గెలవక ముందు ఒకలా.. గెలిచిన తర్వాత మరోలా అన్నట్లు తాము గెలిపించిన ఎంపీ, ఎంఎల్‌ఎలే తమకు వ్యతిరేకంగా పని చేస్తున్నారంటూ అక్కడికి వచ్చిన గిరిజనులంతా లోలోన ఆవేదన పడిన పరిస్థితులు కన్పించాయి.

నేవీ ఆయుధ డిపో.. ఇక్కడొద్దు

- వంకావారిగూడెం గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం
- నేవీ ఆయుధ డిపోకు వ్యతిరేకంగా నినదించిన గిరిజనులు
- పలు ప్రాజెక్టుల పేరుతో ఏజెన్సీని చిధ్రం చేశారంటూ ఆవేదన
- గిరిజనులకు నచ్చజెప్పేందుకు యత్నించిన ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు
- పదేపదే గ్రామసభలు నిర్వహించడంపై గిరిజనుల తీవ్ర అసహనం
- ఎంపీ, ఎంఎల్‌ఎలు తమకు వ్యతిరేకంగా పని చేస్తున్నారంటూ లోలోన ఆవేదన



ఆయుధ డిపోను వ్యతిరేకిస్తూ ఎంఎల్‌ఎకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు


ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, జీలుగుమిల్లి

నేవీ ఆయుధ సామగ్రి డిపో తమ ఏజెన్సీ ప్రాంతంలో పెట్టేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని వంకావారిగూడెం పరిధిలోని ఐదుగ్రామాల ప్రజలు స్పష్టం చేశారు. గతంలోనే తీర్మానాలు చేసినా ఎందుకు మళ్లీమళ్లీ గ్రామసభలు నిర్వహిస్తున్నారంటూ గిరిజనులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని గ్రామస్తులంతా ముక్తకంఠంతో ఆయుధ డిపోను వ్యతిరేకిస్తూ సోమవారం జరిగిన గ్రామసభలో మరోసారి తీర్మానం చేయడం సంచలనం సృష్టించింది.

జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో నేవీ ఆయుధ సామగ్రి డిపో ఏర్పాటు నిమిత్తం భూసేకరణకు సంబంధించి ఇన్‌ఛార్జి తహశీల్దార్ సందీప్ అధ్వర్యంలో సర్పంచి కుంజా పార్వతి అధ్యక్షతన సోమవారం గ్రామసభ నిర్వహించారు. దీనికి పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు, ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పంచాయతీలో రెండుసార్లు గ్రామ సభలు నిర్వహించారని, అప్పుడు ఆయుధ డిపోను వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేశారని తెలిపారు. ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమంలో అప్పటి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కలిసి నేవీ ఆయుధ డిపోకు వ్యతిరేకంగా వినతి ఇవ్వగా, గ్రామసభ ఆమోదం లేకుండా ఎటువంటి కార్యక్రమం జరగదని చెప్పారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామసభ అంటూ మళ్లీ రావడం ఏమిటని నిలదీశారు. దీనిపై ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ నేవీ ఆయుధ సామగ్రి డిపో ఏర్పాటుపై మీకున్న అనుమానాలు తెలపాలని కోరారు. దీంతో గిరిజనులు తమ ఆవేదనను, ఇబ్బందులను ఎంఎల్‌ఎకు వివరించారు. నేవీ ఆయుధ డిపో ఏర్పాటైతే ఏజెన్సీ అనేది కనుమరుగవుతుందన్నారు. గతంలో పోలవరం ప్రాజెక్ట్ పేరుతో పలు గిరిజన గ్రామాలను ఖాళీ చేయించారని తెలిపారు. జల్లేరు, పోగొండ జలాశయాల కోసం గిరిజనులు భూమి త్యాగాలు చేశారని గుర్తు చేశారు. అప్పట్లో ఇంటికో ఉద్యోగం, ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రభుత్వాలు, అధికారులు మాటలు చెప్పారని, భూములు సేకరించాక గిరిజనులను నట్టేట ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు మళ్లీ నేవీ ఆయుధ సామగ్రి డిపో ఏర్పాటు అంటూ తమ భూముల్ని లాక్కుని, ఇక్కడ గిరిజనులను తరిమి కొట్టడానికి సిద్ధమయ్యారని వాపోయారు. ఆయుధ డిపో ఏర్పాటైతే ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు లేకుండా పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎల్‌ఎ బాలరాజు మాట్లాడుతూ నేవీ ఆయుధ సామగ్రి డిపో ఏర్పాటు అనేది కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉందన్నారు. మీ సందేహాలను రాత పూర్వకంగా ఇస్తే వాటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కేంద్రానికి తెలిసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కుంజా పార్వతి, గిరిజన సంఘాల నాయకులు తెల్లం దుర్గారావు, మడకం వెంకటేశ్వరరావు, మడకం శేషగిరి, కుంజా రాముడు, సంకురుడు, పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామాల ప్రజలు పాల్గొనగా పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు పెద్దసంఖ్యలో మొహరించారు.

గిరిజనులకు వ్యతిరేకంగా ప్రజాప్రతినిధుల తీరు

ఎస్‌టి రిజర్వుడు కోటాలో పోలవరం నియోజకవర్గం ఉంది. దీంతో ఇక్కడ గిరిజన నేతలే ఎంఎల్‌ఎలుగా గెలుపొందుతున్నారు. ఎన్నికల్లో గెలవకు ముందు ఒకలా.. గెలిచిన తర్వాత మరోలా ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమలో ఒకరిగా, తాము గెలిపించుకున్న ఎంఎల్‌ఎలు తమకు అనుకూలంగా కాకుండా కార్పొరేట్లకు, బడా భూస్వాములకు అనుకూలంగా పని చేస్తున్నారని వాపోతున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఇప్పటికీ న్యాయం జరగలేదు. పరిహారంగాని, ఇళ్లకు ఇళ్లుగాని, యువతకు పరిహారంగాని, భూమికి..భూమి వంటి అనేక సమస్యలు అలానే ఉన్నాయి. వీటిపై గిరిజనులకు అనుకూలంగా ఎంఎల్‌ఎలు మాట్లాడిన పరిస్థితులు పెద్దగా లేవు. తమ ఓట్లతో గెలిచిన ఎంఎల్‌ఎలు తమ మనోభీష్టానికి అనుగుణంగా కాకుండా పాలకులు ఏం చెబితే అదే అన్నట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఎల్‌టిఆర్ భూముల విషయంలోనూ గిరిజనులకు అండగా నిలవకుండా భూస్వాములకు ప్రజాప్రతినిధులు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో ఆయుధ డిపో ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నాల్లోనూ అక్కడి ప్రజలకు అనుకూలంగా కాకుండా ఎంపీ, ఎంఎల్‌ఎ వ్యవహరిస్తున్నారనే చర్చ సర్వత్రా సాగుతోంది. అభివృద్ధి ముసుగులో గిరిజనులకు అన్యాయం జరుగుతున్నా తాము గెలిపించిన ప్రజాప్రతినిధులు తమకు అండగా నిలబడటం లేదనే అభిప్రాయం గిరిజనుల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకూ ప్రాజెక్టుల పేరుతో గిరిజనులకు న్యాయం జరగకపోయినా ఇప్పుడు కొత్తగా ఏదో చేస్తామన్నట్లు చెప్పడంపై వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాము ఓట్లు వేసి గెలిపించిన ఎంపీ, ఎంఎల్‌ఎలు తమ ఆవేదనను అర్థం చేసుకుని తమకు అండగా నిలబడాలని గిరిజనులు కోరుతున్నారు.


గ్రామ సభ తీర్మానం


మాట్లాడుతున్న మంత్రి పార్థసారధి

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లిలో సోమవారం ఆయన పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు వివిధ సమస్యలపై అందించిన వినతులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోతిరెడ్డిపల్లిలో రూ.10 లక్షలతో రెండు సీసీ రోడ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటుపై సంబంధిత డిఇతో మాట్లాడి వారం రోజుల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చేతిపంపు ఏర్పాటుపై ఆయన స్పందిస్తూ పంపు ఎక్కడ వేయాలనే వివరాలను ఎంపిడిఒకు అందిస్తే పంపు మంజూరు చేస్తారన్నారు. గ్రామ సమీపంలోని అట్ల ఫ్యాక్టరీ నుంచి వచ్చే విషపూరిత నీరు చెరువులో కలుస్తోందని వచ్చిన ఫిర్యాదుపై మంత్రి స్పందిస్తూ సంబంధిత ఫ్యాక్టరీ యాజమాన్యానికి ఆర్‌డిఒ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నోటీసులు జారీ చేస్తారని తెలిపారు. ఇకపై ఫ్యాక్టరీలో నీటిని శుద్ధిచేసే యంత్రాలు ఏర్పాటు చేసుకోవాలని, శుద్ధిచేసిన నీటిని మాత్రమే బయటకు వదలాలని ఆయన స్పష్టం చేశారు. అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ పడమర ప్రాంత రోడ్డు సమస్యను స్థానిక తహశీల్దారు, విఆర్‌ఒలు పరిశీలించి సమస్య పరిష్కరిస్తారని ఆయన చెప్పారు. ఎస్‌సి శ్మశానవాటికకు సంబంధించిన రహదారి విషయంపై మంత్రి స్పందిస్తూ 29 సెంట్ల భూమి విషయంపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడతానని, ప్రత్యామ్నాయ చర్యలపైనా దృష్టి సారిస్తానని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దారు బి.సుబ్బారావు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌లో 238 వినతులు స్వీకరణ

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అందిన దరఖాస్తులను నిర్ధేశించిన సమయంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి 238 వినతులు స్వీకరించినట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్‌ఒ డి.పుష్పమణి, ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, డిప్యూటీ కలెక్టర్లు భాస్కరరావు, ముక్కంటితో కలిసి ప్రజల నుండి ఆమె ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల నుంచి అర్జీల స్వీకరణకు ప్రత్యేక కౌంటరును ఏర్పాటు చేయాలని డిఆర్‌ఒను ఆదేశించారు. వివిధ సమస్యల పరిష్కారానికి అర్జీదారులు అందించిన వినతులను సకాలంలో పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పిజిఆర్ఎస్ ఉండాలన్నారు. వినతులను అధికారులు క్షుణంగా పరిశీలించి రీఓపెనింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. ఏలూరు నరసింహారావుపేటకు చెందిన అప్పారావు ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ అందించాలని అర్జీ అందజేశారు. కొయ్యలగూడెం మండలం బయ్యన్నగూడేనికి చెందిన సోమ విజయ తనకు తెల్లరేషన్ కార్డు, వితంతు పెన్షన్ ఇప్పించాలని కోరారు. ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లి గ్రామానికి చెందిన దీపిక రహదారి ఆక్రమణ కారణంగా ట్రాక్టర్లు, లారీలు సజావుగా రాకపోకలు సాగించడం లేదని, ఆక్రమణలు తొలగించాలని అర్జీ అందజేశారు. బుట్టాయగూడెం మండలం అంతర్వేదిగూడేనికి చెందిన రమణ తమ వ్యవసాయ భూమికి ప్రభుత్వం బోరు వేయించి సర్వీసు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జెసి

8 నుంచి 'ప్రజాపోరు' యాత్రలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నవంబర్ 8వ తేదీ నుండి 15వ తేదీ వరకు సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించే 'ప్రజా పోరు' యాత్రల ప్రచారోద్యమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశానికి తెల్లం రామకృష్ణ అధ్యక్షత వహించారు. సమావేశంలో పలు ప్రజా సమస్యలపై తీర్మానాలు చేశారు. ముఖ్యవక్త సీతారాం మాట్లాడుతూ జిల్లాలో నవంబరు 8 నుండి 14వ తేదీ వరకు 'ప్రజాపోరు' పేరుతో ఇంటింటికీ ప్రచార కార్యక్రమం నిర్వహించాలని, 15న అన్ని తహశీల్దార్, మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రజా పోరు యాత్రలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ, నిత్యావసరాలు, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని, మౌళిక సేవల ప్రయివేటీకరణను వ్యతిరేకించాలని, మహిళలపై, బాలికలపై లైంగిక దాడులు, నేరాలను అణిచివేసేందుకు చర్యలు చేపట్టాలని, జమిలి ఎన్నికల ప్రతిపాదనను వ్యతిరేకించాలని, విశాఖ ఉక్కు పరిరక్షణ, పోలవరం నిర్వాసితులు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని, నిరుద్యోగ సమస్య పరిష్కరించాలనే డిమాండ్‌తో చేపడుతున్నట్లు వివరించారు. ఈ యాత్రలను ప్రజలు జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ట్రూఅప్ ఛార్జీల భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రపంచ బ్యాంక్ ఆదేశాల మేరకు ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల పేరిట ప్రజలపై రూ.6,072 కోట్ల భారాన్ని విధిస్తూ ఎపి విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిందని విమర్శించారు. జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చాక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలును గాలికొదిలేసిందన్నారు. సూపర్ సిక్స్‌ను చిత్తశుద్ధితో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక ప్రకటనలకే తప్ప ఆచరణలో అందడం లేదన్నారు. ప్రయివేటు ఏజెన్సీలకు కాకుండా ఇసుక సరఫరా చేసే బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలన్నారు. మద్యం అమ్మకాలకు గేట్లు ఎత్తేశారని, విచ్చలవిడిగా బెల్టుషాపులు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో ఇంటింటికీ మద్యం అన్నట్లుగా పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, పి.కిషోర్, ఎం.నాగమణి, జి.రాజు మాట్లాడారు. జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహారావు, పి.రామకృష్ణ, ఎం.జీవరత్నం, ఎ.ఫ్రాన్సిస్, కె.శ్రీనివాస్, పి.మంగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంతెన సీతారాం

30న జాబ్‌మేళా

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో సత్రంపాడులోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఈ నెల 30న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఇన్‌ఛార్జి వాడపల్లి కిషోర్ తెలిపారు. ఈ జాబ్ ఫెయిర్‌లో ఎపిఎసి ఫైనాన్సియల్ సర్వీసెస్, టీమ్ లీజ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 170 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించామని, ఈ జాబ్‌మేళాకు పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు ఉండి 18-30 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులని తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయడేటా, సర్టిఫికెట్స్ నకళ్లతో హాజరు కావాలని సూచించారు.

వైరల్ జ్వరాలపై ఇంటింటా సర్వే

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

గ్రామాల్లో వైరల్ జ్వరాలపై ఇంటింటా సర్వేకు వైద్యాధికారులు చర్యలు చేపట్టారు. వైరల్ జ్వరాలతో జనం విలవిల శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనంపై స్పందించిన వైద్యాధికారులు సోమవారం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ముదినేపల్లి పిహెచ్‌సి పరిధిలోని గ్రామాల్లో వైరల్ జ్వరాలపై ఎఎన్‌ఎంలు, ఆశాలు ఇంటింటా సర్వే నిర్వహించారు. గ్రామాల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లడంతోపాటు ఫాగింగ్ యంత్రాలతో స్ప్రే చేయించారు. యాంటీబయోటిక్ ఇంజెక్షన్లు చేయరాదని గ్రామాల్లోని పిఎంపిలు, ఆర్ఎంపిలకు నోటీసులు జారీ చేశారు.



గ్రామాల్లో ఫాగింగ్ చేయిస్తున్న వైద్య సిబ్బంది

చెకుముకి సంబరాలు

విజ్ఞానదాయకం.. వినోదాత్మకం..

ప్రజాశక్తి - ఏలూరు

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన 34వ జిల్లాస్థాయి చెకుముకి సంబరాలు స్థానిక బిజిటిఒ మున్సిపల్ హైస్కూల్‌లో విజ్ఞానదాయకంగా, వినోదాత్మకంగా జరిగాయి. ఈ సంబరాలకు జిల్లావ్యాప్తంగా మండల స్థాయిలో ఫస్ట్, సెకండ్ వచ్చిన ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎనిమిది, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులను ఒక గ్రూపుగా చేసి చెకుముకి సంబరాల టెస్టు నిర్వహించారు. తదుపరి పిల్లల్లో అంతర్గతంగా ఉన్న సామర్థ్యాలను వెలికి తీసే ప్రయత్నంలో భాగంగా విద్యార్థులతో కథలు రాయించారు. ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు సైంటిఫిక్ టెంపర్ పెంచేలా ఆటలు, వంద మంది శాస్త్రవేత్తల ఫొటోలిచ్చి వారి పేర్లను గుర్తించే కార్యక్రమం నిర్వహించారు. చెకుముకి సంబరాల ప్రారంభ సభకు ఓవి.ధనుంజయరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వాసుపత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ రావి గోపాలకృష్ణయ్య మాట్లాడుతూ సమాజంలో పాతుకుపోయిన మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా యువత అవగాహన పెంచుకోవాలని, సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ఎన్.రమేష్ మాట్లాడుతూ మేధావి మౌనం సమాజానికి చేటని అన్నారు. 34 సంవత్సరాలుగా చెకుముకి సంబరాలను విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహనను, పరిశీలనా శక్తిని, ప్రశ్నించేతత్వాన్ని పెంచేలా నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం పెరగాలన్నారు. బహుమతుల ప్రదాన సభలో రిటైర్డ్ జడ్జి అడబాల లక్ష్మి మాట్లాడుతూ చిన్నతనం నుంచి విద్యార్థుల్లో సామాజిక స్పృహ, ఆలోచనా శక్తి పెంచే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రముఖ న్యాయవాదులు పిపి శాస్త్రి, కూన కృష్ణారావు, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేంద్ర మాట్లాడారు. ప్రయివేటు స్కూళ్ల నుంచి మొదటి స్థానం పొందిన జంగారెడ్డిగూడెం ప్రతిభ స్కూలుకు, ద్వితీయ స్థానం పొందిన నూజివీడు త్రివిధ స్కూలుకు, తృతీయ స్థానం పొందిన టి.నర్సాపురం సాయి పబ్లిక్ స్కూల్‌కు, ప్రభుత్వ పాఠశాలల నుండి మొదటి స్థానం పొందిన గోపన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు, రెండో స్థానం పొందిన కస్తూరిబాయ్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు, మూడో స్థానం పొందిన సత్రంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు మెమెంటోతోపాటు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమాలను ఐవి.సుధాకర్, నారాయణరావు, బొడెం శ్రీనివాసరావు, సాయి రమేష్, బి.మోహన్‌రావు పర్యవేక్షించగా విజిఎంవిఆర్.కృష్ణారావు, కె.రామాంజనేయులు, దుర్గాంబ, అఖిల్, సుబ్బరాజు, అప్పారావు, గంగాధర్‌రావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రావి గోపాలకృష్ణయ్య

పర్యావరణహిత గ్రామంగా పొలసానిపల్లి

సర్పంచి షేక్ రహీమాబేగం హసేన

ప్రజాశక్తి - భీమడోలు

పొలసానిపల్లిని పర్యావరణహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు మొక్కలు నాటడంతోపాటు వాటి పరిరక్షణకు ప్రాధాన్యతివ్వాలని ఆ గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో రెండో విడత మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. దీనిలో భాగంగా సాగునీటి చెరువు గట్ల పరిరక్షణ, పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చే క్రమంలో ఫల సాయం ఇచ్చే మొక్కలను చెరువుగట్లపై నాటే పనులకు సర్పంచి శ్రీకారం చుట్టారు. అతి రద్దీగా ఉండే భీమడోలు-ద్వారకాతిరుమల ఆర్అండ్‌బి రోడ్డు గ్రామం మధ్యగా వెళుతున్న క్రమంలో ప్రయాణికులకు, ముఖ్యంగా వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూసేందుకు, పర్యావరణాన్ని కాపాడేందుకు డివైడర్‌పై పదుల సంఖ్యలో మొక్కలను నాటారు. మొక్కలను సమకూర్చడంలో వివిధ కారణాల వల్ల జాప్యం జరగడంతో సర్పంచి రహీమా బేగం హసేన, కార్యదర్శి రామకృష్ణ, పంచాయతీ పాలకవర్గం చొరవ తీసుకుని సొంతంగా మొక్కలను సమకూర్చుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద ఇప్పటికే పంచాయతీకి ఆదాయం సమకూర్చే కొబ్బరి మొక్కలు నాటామన్నారు. గ్రామంలో ఎంపిక చేసిన సాగునీటి చెరువుల గట్లపై ఫలసాయం ఇచ్చే మొక్కలను నాటి, వాటి పరిరక్షణ బాధ్యత చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, అధికారులు, కూటమి నేతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న సర్పంచి

బెల్టుషాపులు లేకుండా చూడాలి

అధికారులతో ఎంఎల్‌ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మద్యం బెల్టు దుకాణాలు నిర్వహించే వారు ఎంతటివారైనా ఉపేక్షించొద్దని ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు అధికారులకు సూచించారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఎక్సైజ్, పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎంఎల్‌ఎ మాట్లాడారు. మద్యం బెల్టు దుకాణాలు లేకుండా అధికారులు నిరంతరం తనిఖీలు, దాడులు నిర్వహించి సంబంధిత నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలన్నారు. ఎక్సైజ్ చట్టం పారదర్శకంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో నిడమర్రు, భీమడోలు సిఐలు ఎంవి.సుభాష్, ఎంజె.విల్సన్, తాడేపల్లిగూడెం, భీమడోలు ఎక్సైజ్ సిఐలు కళ్యాణ్ చక్రవర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ధర్మరాజు

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి డ్రాయింగ్ పోటీలు ఎంతగానో దోహదపడతాయని పవర్‌గ్రిడ్ నున్న జనరల్ మేనేజర్ నాగమోహనరావు అన్నారు. మండల పరిధిలోని తోటపల్లి ఎంపియుపి(ప్రీ హైస్కూల్)లో సోమవారం విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా కల్చర్ ఆఫ్ ఇంటిగ్రిటీ ఫర్ నేషన్స్ ప్రాస్పెరిటీ అంశంపై విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఆరేపల్లి శ్రీ పద్మ, పవర్‌గ్రిడ్ డిప్యూటీ మేనేజర్ శివనాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు టి.శోభారాణి పాల్గొన్నారు.

మనోజ్, వైష్ణవిల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ముదినేపల్లి



మనోజ్, వైష్ణవిలను సత్కరిస్తున్న వక్తలు

ముదినేపల్లిలో ప్రముఖ వైద్యులు అంబుల మనోజ్, వైద్య విద్యార్థిని, అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ముదినేపల్లి ఎపిఎస్‌పిఎం బిఎడ్ కళాశాలలో వైద్యులు అంబుల మనోజ్, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవికు సోమవారం సత్కార సభ నిర్వహించారు. ప్రస్తుతం వైద్య విద్యార్థిగానే ఉన్న వైష్ణవి తన సహకారంతో ముదినేపల్లి గ్రామీణప్రాంతంలో పాటు పలు గ్రామాల్లో సొంత ఖర్చుతో పాఠశాలలను బాగుచేయించడం, రాజధాని కోసం, పోలవరం కోసం విరాళం ఇవ్వడం ఎంతో గొప్ప విషయమని ఎస్‌పిఎం బిఎడ్ కాలేజీ ప్రిన్సిపల్ కూనవరెడ్డి సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కుమారి కూనవరెడ్డి హరిత, అధ్యాపకులు ఒ.మణిభీమరాజు, బి.కృష్ణమోహన్, జివిఎల్.శివ, వి.దుర్గ, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు కోరుతూ వినతి

ప్రజాశక్తి - ముసునూరు

నూజివీడు నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో కొండల్లో అక్రమ మైనింగ్‌కి పాల్పడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.వాణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గ పరిధిలోని సిద్ధార్థనగరం, సుంకొల్లు గ్రామాల అటవీ భూమిలో సాగు చేసుకుంటున్న పేద రైతుల భూములను సుమారు వంద ఎకరాలు, డబ్బు ఆశ చూపించి కొనుక్కునేందుకు ప్రయత్నించిన భూ దందాదారులపై చర్యలు తీసుకునేలా రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖ వారికి ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

దూర విద్యాకేంద్రం పునఃప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆదేశాల మేరకు ఏలూరు సర్ సిఆర్‌రెడ్డి కళాశాల ప్రాంగణంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రాన్ని పునఃప్రారంభించినట్లు సర్ సిఆర్‌రెడ్డి కళాశాల ప్రిన్సిపల్, ఎయు విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రామరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతకాలంగా దూరవిద్యా కేంద్రాన్ని మూసివేసినప్పటి నుంచి విద్యార్థుల అనేక ఇబ్బందులను గుర్తుచేస్తున్నారని గమనించిన విశ్వవిద్యాలయం వారు విద్యార్థుల అవసరాల రీత్యా దూరవిద్యకు సంబంధించిన సేవలు అందుబాటులో ఉండాలని ఈ కేంద్రాన్ని తిరిగి పునఃప్రారంభించడం హర్షించదగిన విషయమని తెలిపారు.

నేత్రాలను సంరక్షించుకోవాలి

భీమడోలు :నేత్రాల సంరక్షణకు వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని భీమడోలు సిహెచ్‌సి పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత కోరారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వేదికగా నేత్ర పరీక్షా శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. సామాజిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత నేత్రాల పరిరక్షణ పట్ల అవగాహన కల్పించారు. ఆర్‌టి క్రమంలో ఏలూరు కేంద్ర ప్రభుత్వ వైద్యశాల, పోతునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన పారా మెడికల్ ఆప్తాల్మిక్ అధికారులు జె.వెంకటరెడ్డి, ఎం.దివ్య వైద్య పరీక్షలను చేశారు. గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన అధికారులు, సిబ్బందితో పాటు భీమడోలు హెల్త్ క్లినిక్కు చెందిన అధికారులు సిబ్బంది, మురళీ అధికారులకు సహకరించారు.

భారీ అన్న సమారాధన

ముదినేపల్లి :స్థానిక బంటుమిల్లి రోడ్డులో శ్రీదేవి శరన్నవరాత్రులు ముగింపు సందర్భంగా కనకదుర్గమ్మ ఆలయం వద్ద సోమవారం జరిగిన అన్న సమారాధన కార్యక్రమాన్ని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శీలం రామకృష్ణ, బొర్రా చలమయ్య, పార్టీ మండలాధ్యక్షులు మొట్రూ ఏసుబాబు, రాష్ట్ర బిసి నాయకులు కోమటి విష్ణువర్ధన్, జాస్తి చంటిబాబు, సాక్షి సాయిబాబు, కూనవరెడ్డి సత్యనారాయణ, కమిటీ సభ్యులు, కొల్లి నాని, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

విద్యుదాఘాతంతో తాపీ మేస్త్రి మృతి

ప్రజాశక్తి - కలిదిండి

విద్యుదాఘాతంతో తాపీ మేస్త్రి మృతి చెందిన సంఘటన మండలంలోని కోరుకొల్లులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పాలూరి సురేష్ (45) కోరుకొల్లులోని కూనపురెడ్డి (లక్ కలన్) ఇంటి వద్ద తాపీ పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. సురేష్ రాజోలు నుంచి ఐదేళ్ల క్రితం కోరుకొల్లు వచ్చి తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు.

గ్యాస్ లీకై రేకుల షెడ్డు దగ్ధం

రూ.10 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - ముసునూరు

గ్యాస్ లీకై రేకులషెడ్డు దగ్ధమైన ఘటనలో రూ.పది లక్షల ఆస్తి నష్టం సంభవించింది. ఈ ఘటన మండలంలోని గోపవరంలో చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన కట్టె శ్రీనివాసరావు భార్య అనురాధ ఆదివారం రాత్రి వంట చేస్తుండగా గ్యాస్ పొయ్యికి ఉన్న పైపు లీకై మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లోవారందరూ బయటకు పరుగులు తీశారు. ప్రమాదం నుంచి బయటపడ్డారు. మంటల్లో బీరువాలోని రూ.1.50 లక్షల నగదు, విలువైన వస్తువులు, పొలం దస్తావేజులు దగ్ధమయ్యాయి. సుమారు రూ.పది లక్షల ఆస్తినష్టం చేకూరినట్లు విఆర్‌ఒ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

టి.నరసాపురం :పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ వి.జయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... టి.నరసాపురం శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు టి.నరసాపురం పోలీసులు సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2,100 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

మండవల్లి :ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న ఘటనలో గాయాలపాలైన ముగ్గురిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఒక వ్యక్తి మృతి చెందాడు. మండవల్లి ఎస్ఐ రామచంద్రరావు తెలిపిన వివరాల ప్రకారం... కైకలూరు మండలం ఆలపాడుకు చెందిన వేంద్ర వెంకటేష్ ఆదివారం భైరవపట్నంలో వల పని నిర్వహించుకుని తిరిగి బైక్‌పై ఆలపాడు బయలుదేరాడు. ఉత్తరప్రదేశ్ గరకపూర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు రామకృష్ణ, శ్రీరామసుబ్రహ్మణ్యం భీమవరంలో వడ్లంగి పని నిర్వహించుకుని తిరిగి బైక్‌పై గుంటూరు బయలుదేరారు. ఈ క్రమంలో జాతీయ రహదారి165 పామర్రు దిగమర్రు వాడపాలెం రైల్వే గేటు సమీపంలో ఇరువురి ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గాయాలపాలైన ముగ్గురిని కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో రామకృష్ణ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య నిమిత్తం ఆదివారం రాత్రి సుమారు 7:30 గంటల సమయంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదేరోజు రాత్రి మృతి చెందాడు. రామసుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పుట్టగొడుగుల్లా బెల్టు షాపులు..!

గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

చూసీ చూడనట్లు ఎక్సైజ్ అధికారుల తీరు

మద్యం సరఫరా చేసే దుకాణాలపై చర్యలు శూన్యం



ప్రజాశక్తి - చింతలపూడి

బెల్టుషాపులు నిర్వహించేవారిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకుంటే వారు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. బెల్ట్‌షాపులకు అనుమతులు లేకపోయినా నిర్వహించాలని దుకాణదారులు ప్రోత్సహిస్తున్నారు. ఎక్సైజ్ శాఖాధికారులు బెల్టుషాపుల నిర్వహించేవారినే పట్టుకుంటున్నారని, మద్యం సరఫరా చేసే దుకాణదారులపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు చెబుతున్నారు.

రాష్ట్రంలో అధికారంలోకొచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం నూతన మద్యం విధానాన్ని తీసుకొచ్చింది. సర్కారు మద్యం దుకాణం నిర్వహించే విధానానికి స్వస్తి పలికి ప్రయివేట్ వ్యక్తులు మద్యం షాపులు నిర్వహించేందుకు అవకాశం కల్పించింది. లాటరీ పద్ధతిలో ప్రయివేట్ వ్యక్తులు మద్యం షాపులను దక్కించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ షాపులు మహిళలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గతంలో మాదిరిగానే అనుమతి పొందిన మద్యం షాపులకు అనుబంధంగా బెల్ట్ షాపులు అక్రమంగా నిర్వహించేందుకు కొందరు సిద్ధపడుతున్నారు. అందులో భాగంగా గ్రామాల్లో పెద్దలు, ఇతరత్రా నాయకులతో బెల్టుషాపు నిర్వహించే ఆసక్తి ఉన్నవారితో మంతనాలు సాగిస్తున్నారు.

బెల్ట్ షాపులు ఏర్పాటుపై కొందరు ఇప్పటికే సిద్ధమైనారు.

ఎక్సైజ్ శాఖ వారు బెల్ట్ షాపుల నిర్వాహకులపై మాత్రమే కేసు నమోదు చేస్తున్నారు. బెల్టు షాపులు అమ్ముకోవడానికి మద్యం సరఫరా చేసే దుకాణదారులపై, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ, పోలీసు వారు ఇప్పటివరకు కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవు. బెల్టు షాపు నడిపే వ్యక్తులు మద్యం ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారో తెలుసుకుని వారిపై ఎందుకు కేసును నమోదు చేయడంలేదో అర్థం కాని పరిస్థితి. ఇటీవల బెల్ట్ షాపు నడిపే వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేయగా అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

గత ప్రభుత్వంలో సారా స్థావరాలపై దాడులు చేస్తే సారా ఎక్కడి నుంచి వచ్చిందో, సారా తయారీకి బెల్లం ఎవరు సరఫరా చేస్తున్నారో తెలుసుకుని బెల్లం అమ్మకం దుకాణదారులపై కూడా కేసులు నమోదు చేసిన సంఘటనలు మండలంలో ఉన్నాయి. బెల్టుషాపులు అక్రమంగా అమ్ముకుంటూ పట్టుపడితే, బెల్ట్ అమ్మడానికి మద్యం ఎవరు సరఫరా చేశారో తెలుసుకుని ఆ దుకాణదారులపై కేసు నమోదు చేసి లైసెన్స్ క్యాన్సిన్ చేస్తారా లేదా అర్థం కాని పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వం నియమ నిబంధనలకు లోబడి ప్రభుత్వానికి మంచి పేరు వచ్చే విధంగా నడిపిస్తారా లేదా, అక్రమంగా బెల్ట్ షాపులకు అనుమతులు ఇస్తూ గ్రామాల్లో మద్యం విచ్చలవిడిగా అమ్ముతూ మహిళలను ఇబ్బందులు పెడతారా అనేది అర్థం కాని విషయం.

ఉద్యోగాలిప్పిస్తామనే దళారుల మాటల నమ్మొద్దు

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వ ఉద్యోగాల కోసం దళారులు మాటలు నమ్మి మోసపోవద్దని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ చెప్పారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్, అదనపు ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు ఆధ్వర్యంలోసోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పలువురు వచ్చి ఫిర్యాదులు ఇచ్చారు. ఒక వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.ఎనిమిది లక్షలు వసూలు చేసి ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేశాడని, వారిపై చర్యలు తీసుకోవాలని కొంతమంది వ్యక్తులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని గతంలో కూడా ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ప్రజలు ఆశతో ప్రభుత్వ ఉద్యోగుల కోసం దళారుల మాటలు నమ్ముతున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు రావాలంటే ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేస్తుందని, దానికి ప్రామాణిక పరీక్షలను నిర్వహించి సదరు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తేనే ఉద్యోగావకాశాలు కలుగుతాయని, డబ్బులు ఇస్తే ఉద్యోగాలు లభించవని చెప్పారు. చేతబడులు అనే మూఢనమ్మకాలను ప్రజలు నమ్మవద్దని, ఆధునిక ప్రపంచంలో ఎంతో ముందంజుకు వెళ్తున్న ఇంకా పల్లెసీమల్లో చేతబడుల పట్ల అపనమ్మకాలు ఏర్పరచుకుని ఎదుటివారిని హింసిస్తున్నారని చెప్పారు. అలా ఎవరన్నా చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వచ్చిన సుమారు 53 ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులతో ఎస్‌పి ఫోన్‌లో మాట్లాడి ఆదేశాలు ఇచ్చినారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదిదారులకు భోజన సదుపాయాలను శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

విత్తన కంపెనీలతో రాతపూర్వక అగ్రిమెంట్ తప్పనిసరి

మొక్కజొన్న రైతులకు జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌బాషా సూచన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

కంపెనీ ఆర్గనైజర్లు మౌఖికంగా అధిక దిగుబడులు ఆశగా చూపి దిగుబడి రాకపోయినా నష్టపరిహారం ఎకరాకు రూ.80 నుంచి రూ.90 వేల వరకు ఇస్తామని చెప్పే వదంతులు నమ్మవద్దని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కె.హబీబ్‌బాషా చెప్పారు. పట్టణంలోని సహాయ వ్యవసాయ సంచాలకులు కార్యాలయంలో మొక్కజొన్న సీడ్ ప్రొడక్షన్, కంపెనీ ఆర్గనైజర్లు, రైతు ఉత్పత్తిదారుల సంఘంతో ఆయన సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో పలు అంశాలను చర్చించారు. సీడ్ ప్రొడక్షన్ ద్వారా మొక్కజొన్న సాగు రైతులు కచ్చితంగా కంపెనీ ఆర్గనైజర్ల వద్ద నుంచి అగ్రిమెంట్ లిఖితపూర్వకంగా తీసుకున్న తర్వాత మాత్రమే సాగు చేపట్టాలని సూచించారు. పంట వేసిన వెంటనే సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా రైతు వేసిన కంపెనీ విత్తన రకాలను ఇపంట ద్వారా నమోదు చేసుకోవాలని చెప్పారు. ప్రయివేట్ కంపెనీ ఆర్గనైజర్లు, ఇతరులు నిబంధనలను అతిక్రమించి రైతులకు విత్తనాలు ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చింతలపూడి : ఆర్గనైజర్ వద్ద నుంచి అగ్రిమెంటు లిఖిత పూర్వకంగా తీసుకున్న తర్వాత మాత్రమే సాగు చేపట్టాలని చింతలపూడి మండల వ్యవసాయాధికారి మీనాకుమారి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మౌఖికంగా అధిక దిగుబడుల ఆశగా చూపి, దిగుబడి రాకపోయినా అధిక మొత్తం డబ్బులు ఇస్తామని చెప్పే వాదంతులు నమ్మవద్దని తెలిపారు. పంట వేసిన వెంటనే కంపెనీ విత్తన రకాలను ఇ పంట ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. కంపెనీ నుంచి అగ్రిమెంట్ తీసుకుని మొక్కజొన్న సాగు చేసుకోవాలని కోరారు. ప్రయివేట్ కంపెనీ ఆర్గనైజర్లు, ఫీల్డ్ సిబ్బంది నిబంధనలు అతిక్రమించి రైతులకు విత్తనాలు ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టిడిపి నేతపై చర్యలు కోరుతూ జనసేన ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పవన్‌కళ్యాణ్‌పై, ఘంటసాల వెంకటలక్ష్మిపై దుర్భాషలాడిన టిడిపి నేత సైదు గోవర్ధన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జనసేన దెందులూరు నాయకుడు చందు కోరారు. ఈ మేరకు ఏలూరు కలెక్టరేట్ వద్ద జనసేన దెందులూరు నియోజకవర్గ నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ శ్రీపర్రు గ్రామానికి చెందిన టిడిపి నేత సైదు గోవర్ధన్, అతని కుమారుడు దినేష్ సామాజిక మాధ్యమాలు వేదికగా ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌పికి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా టిడిపి నాయకులు తగు చర్యలు తీసుకోకపోతే జనసేన పార్టీ తరపున మరింత తీవ్రంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

వ్యక్తిగతంగా చెట్లు పెంచుకునే అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

వన సంరక్షణ సమితి సభ్యులకు వ్యక్తిగతంగా చెట్లు పెంచుకునే అవకాశం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయు జిల్లా కార్యదర్శి కుంచే వసంతరావు కోరారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం మండలాధ్యక్షులు ముల్లగిరి లాజరు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ వన సంరక్షణ సమితులు 1996లో ఏర్పాటు చేశారని, అప్పటి నుంచి ఇప్పటివరకు అడవి భూముల్లో ఫారెస్ట్ అధికారులు విఎస్ఎస్ సభ్యులు ఉమ్మడి యాజమాన్యం పద్ధతిలో మొక్కలు వేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం సరైన సమయంలో మొక్కలు ఇవ్వకపోవడం వల్ల వేసిన మొక్కలు పెరగాక వాటిపై శ్రద్ధ లేదని, వన సంరక్షణ సమితి సభ్యులకు వ్యక్తిగతంగా మొక్కలు పెంచుకునే అవకాశం కల్పించాలని కోరారు.

ఆశ్రం ఆధ్వర్యంలో ఉచిత బస్సు సౌకర్యం

ప్రజాశక్తి - దెందులూరు

ఆసుపత్రికి వచ్చే రోగుల కోసం ఆశ్రం ఏర్పాటు చేస్తున్న ఉచిత బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి చెప్పారు. సోమవారం ఆశ్రం ఆసుపత్రి వద్ద ఉచిత బస్సు సౌకర్యాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆశ్రం సిఎఒ డాక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ ఏలూరు స్థానిక ప్రజల సౌకర్యార్థం ఆశ్రం హాస్పిటల్స్ నుంచి ప్రారంభమయ్యే ఉచిత బస్సు సౌకర్యం తంగెళ్లమూడి, అశోక్‌నగర్, ఫైర్ స్టేషన్, పాత బస్టాండ్ మీదుగా ఆశ్రం హాస్పిటల్స్ చేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నూర్జహాన్, గ్రూప్ ఛీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రాజ రాజన్ పాల్గొన్నారు.

'కార్యకర్తల సంక్షేమానికి చంద్రబాబు కృషి'

ముసునూరు :ప్రతి కార్యకర్త సంక్షేమానికి కృషి చేసే నాయకుడు సిఎం చంద్రబాబునాయుడేనని టిడిపి వలసపల్లి గ్రామ అధ్యక్షులు మెదరమెట్ల సురేంద్ర అన్నారు. మండలంలోని వలసపల్లిలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ప్రతి కార్యకర్తకూ లబ్ధి చేకూరాలనే ఉద్దేశంతో ఏదైనా ప్రమాదానికి గురైతే సంక్షేమ నిధి నుంచి రూ.ఐదు లక్షలకు పెంచినట్లు తెలిపారు. గ్రామ సర్పంచి చలసాని దామోదరరావు, టిడిపి గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నూజివీడు ఆర్‌జియుకెటిలో అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

హైదరాబాద్‌కు చెందిన మేడ్ ఈజీ ఎడ్యుకేషన్ ప్రయివేట్ లిమిటెడ్ సహకారంతో నూజివీడు ఆర్‌జియుకెటి, శ్రీకాకుళం విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ తరగతులు, గేట్, ఎఇఎస్ పరీక్షల కోసం టెస్ట్ సిరీస్‌లను అందించే లక్ష్యంతో స్కాలర్‌షిప్ పరీక్షతో పాటు సమాచార అవగాహన సెషన్‌ను సోమవారం నిర్వహించారు. మేడ్ ఈజీకి చెందిన సీనియర్ ఫ్యాకల్టీ మెంబర్ జితేంద్ర తివారీ ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు హెయ్యర్ ఎడ్యుకేషన్ సెల్ ఇన్‌ఛార్జి ఎం.రామకృష్ణను డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్ తో పాటు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.లక్ష్మణరావు అభినందించారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు అభినందన

టి.నరసాపురం : జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో విజయం సాధించి మూడో స్థానంలో నిలిచిన విద్యార్థులను మండల విద్యాశాఖాధికారి టి.రామ్మూర్తి సోమవారం అభినందించారు. జిల్లా కేంద్రమైన ఏలూరులో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో తృతీయ స్థానంలో నిలిచిన స్థానిక శ్రీసాయి సూర్య హైస్కూల్ విద్యార్థులు ఎం.సంజయ్ (పదో తరగతి), కె.దివ్యశ్రీ (తొమ్మిదో తరగతి), జి.తులసిప్రియ (ఎనిమిదో తరగతి)లను అభినందించారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో అభినందన సభ నిర్వహించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు పురం శ్రీనివాస్, క్రాంతి నికేతన్ పాఠశాల కరెస్పాండెంట్ బిఎన్.సాగర్, శ్రీ సాయి సూర్య హైస్కూల్ కరెస్పాండెంట్ కె.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆక్రమణలపై వాస్తవాలు తెలపాలని వినతి

ప్రజాశక్తి - మండవల్లి

కొల్లేరు అభయారణ్యంలో ఆక్రమణలపై వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు అన్నారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో తహశీల్దార్‌కు గోపాల్‌కు, ఎంపిడిఒ రామలింగేశ్వరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ కొల్లేరు ఆపరేషన్‌తో 5 కాంటూరు వరకు విస్తరించడంతో పర్యావరణ పరిరక్షణతో పాటు చిత్తడి నేలలను రక్షించుకోవడం వలస పక్షుల ఆవాసాలకు రక్షణ ఏర్పడిందని సరస్సు విస్తీర్ణంతో వైశాల్యం పెరిగిందని తద్వారా ముంపు ప్రమాదం కూడా తగ్గిందని చెప్పారు. కొల్లేరు ఆపరేషన్ అనంతరం ప్రభుత్వ లక్ష్యం నీరుగార్చే విధంగా కొల్లేరు అభయారణ్యంలో తిరిగి ఆక్రమణలు యథేచ్ఛగా జరిగిపోయాయన్నారు. దీంతో కొల్లేటి ప్రాంత ప్రజల జీవనోపాధి పూర్తిస్థాయిలో దెబ్బతిందన్నారు. కొల్లేరులో పెరిగిపోయిన ఆక్రమణలపై సుప్రీంకోర్టు మండిపడి కోర్టు ధిక్కరణ నోటీసులను ప్రభుత్వానికి జారీ చేసిందన్నారు. కైకలూరు, మండవల్లి మండలాల్లోని చింతపాడు, పులపర్రు, గుమ్మళ్లపాడు, పందిరిపల్లిగూడెం, శృంగవరపాడు గ్రామాల పరిధిలోని కొల్లేరులో జరిగిన ఆక్రమణలపై అధికారులు ప్రజలకు పూర్తిస్థాయిలో స్పష్టత ఇవ్వాలని అన్నారు. కొల్లేరు ఆపరేషన్ ద్వారా కొల్లేటి ప్రజల జీవనోపాధి దెబ్బతినకుండా ఉండేలా చూడాలని సుప్రీంకోర్టు సాధికారత కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించి నేటికీ 18 సంవత్సరాలు గడిచినా ఆ అంశాన్ని ఏ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమాలపై నిజనిజాలు ప్రజలకు తెలియపరచాలని కొల్లేరు ఆపరేషన్లు అదనంగా ధ్వంసం చేసిన భూములను కొల్లేటి ప్రజలకు తిరిగి ఎప్పుడు అందిస్తారనేది, కొల్లేరు ఆపరేషన్ సమయంలో ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు 120 జిఒ సూచించిన ప్రకారం వాగ్దానాలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండలాధ్యక్షుడు టి.అప్పారావు, కె.సూర్యారావు పాల్గొన్నారు.

జిఒ 3కి చట్టబద్ధత కల్పించాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

జిఒ నెంబర్-3కి చట్టబద్ధత కల్పించాలని, ప్రత్యేక డిఎస్‌సి చట్టం తీసుకురావాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు కాకి మధు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. పూర్వం 1990 నుంచి ఈ ప్రాంతంలో ఆదివాసీలు పోడు భూములు సాగు చేసుకుంటున్నారని, వారిని గుర్తించి వారికి హక్కు పత్రాలు మంజూరు చేయాలని కోరారు. జిఒ 3 చట్టం చేయకపోతే సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షులు కోరం సంజీవరావు, మండలాధ్యక్షులు పైదా చినబాబు, కార్యదర్శి వేణుగోపాల్, మాధవరం సర్పంచి పాయం సత్యనారాయణ, అశోక్, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యోగాలు ఆదివాసీలకే కేటాయించాలి

పోలవరం :డిఎస్‌సి-2024 ఉపాధ్యాయ నియామకాలు స్థానిక గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో, స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి మాజీ సభ్యులు మిడియం వెంకటస్వామి మాట్లాడుతూ జిఒ 57 ప్రకారం షెడ్యూల్ ప్రాంతంలో అన్ని రకాల నియామకాలను గిరిజన ప్రాంత అభ్యర్థులతో భర్తీ చేయాలని కోరారు. పాతకోట రామారావు, కుర్సం రమేష్, కొక్కెర రాంబాబు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

బాణసంచా విక్రయాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని పట్టణ సిఐ సత్యశ్రీనివాస్ తెలిపారు. పోలీసుల సూచనలు, నియమ నిబంధనలు పాటించాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘించినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆంజనేయ టైల్స్ పార్క్ ప్రారంభం

ప్రజాశక్తి - మండవల్లి

వినియోగదారులకు ఉత్తమమైన సేవలందించడమే అంజని టైల్స్ లక్ష్యమని విన్నర్ సిరామిక్స్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయిసుమన్ తెలిపారు. మండలంలోని పెరిగేగూడెంలో ఆంజనేయ టైల్స్ పార్క్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరల్డ్ క్లాసు క్వాలిటీతో కాంపిటీషన్లకు దీటుగా వినియోగదారులకు టైల్స్ అందించేందుకు అంజని టైల్స్ పార్క్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ప్రెసిడెంట్ గాంధీ రాజు, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, కంపెనీ జిఎం అమర్నాథ్, హెచ్ఆర్ ఎజిఎం శ్రీనివాస్, దక్షిణ భారతదేశ ప్రముఖ డీలర్లు, మార్కెటింగ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం వ్యవసాయ శాఖ అధికారి బి.శివశంకర్ ఆధ్వర్యంలో చాట్రాయి, చనుబండ, మర్లపాలెం గ్రామాల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేడ్-1 రకం వంద కేజీలు 2320, 75 కేజీలు 1740, 40 కేజీలు రూ.928 కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. సాధారణ రకమైతే వంద కేజీలు రూ.2,300, 75 కేజీలు రూ.1,725, 40 కేజీలు రూ.920 కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. చాట్రాయి కొనుగోలు కేంద్రాన్ని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, చనుబండ కొనుగోలు కేంద్రాన్ని ఏలూరు జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మర్లపాలెం గ్రామంలో గ్రామ ఉప సర్పంచి వెల్ది రాజారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, కొనుగోలు కేంద్రాల సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం చేయాలని టిడిపి మండల నాయకులు సిఎం చంద్రబాబును కోరారు. ఈ మేరకు చంద్రబాబును రాష్ట్ర సచివాలయంలో సోమవారం కలిశారు. ఈ సందర్భంగా టిడిపి మండల నాయకులు అమరవరపు అశోక్ నిర్వాసితుల సమస్యలను చంద్రబాబుకు వివరించారు. స్పందించిన సిఎం చంద్రబాబు నిర్వాసితుల త్యాగాలు వెలకట్టలేనివని, ప్రతి నిర్వాసితుడికీ న్యాయం చేస్తామని, ఎవరూ అధైర్య పడవద్దని తెలిపారని చెప్పారు.

టిడిపి నేతకు పరామర్శ

ప్రజాశక్తి - కుక్కునూరు

అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక రామాలయం వీధికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు ఊటుకూరి నరసింహారావును మండలాధ్యక్షుడు మొలిశెట్టి నాగేశ్వరరావు సోమవారం పరామర్శించారు. బ్రెడ్, పండ్లు అందించి ఎప్పుడూ అండగా ఉంటానని చెప్పారు. ఆయనతో పాటు ఉప సర్పంచి పిచ్చుక రాజు, తెలుగు యువత మండలాధ్యక్షులు అంగిరేకుల బాలాజీ, తదితరులు ఉన్నారు.



నా మేనకోడలు భారతి మా కుటుంబ సహకారి

పెద్ద మేనమామ దయానందరాజు

నా మేనకోడలు భారతి తన కుటుంబాన్ని ఏవిధంగానైతే చూసుకుంటుందో మా కుటుంబాన్ని కూడా అదేవిధంగా చూసుకుంటుంది. మా కుటుంబంలో ఏ కార్యక్రమం జరిగినా భారతి ముందుండి నడిపిస్తుంటుంది. ఆ విధంగానే భారతి స్కూల్లో కూడా అంతే అన్నిట్లోనూ ముందుండి నడిపిస్తుంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే భారతి మా కుటుంబ సహకారి. పిల్లలను భారతి బాగా చూసుకుంటుంది. భారతి కుమారుడు రాజేష్ పాలిటిక్స్ చేసిన తర్వాత బందర్లో బిటెక్ చేసి ఉన్నత చదువు చదివి, మంచి పోస్టులో స్థిరపడ్డాడు. వాడి చెల్లి గాయత్రి కూడా బాగా చదివింది. పిల్లలను పెంచడంలో భారతి ఎంతో సక్సెస్ అయ్యింది.



మా అమ్మ ప్రోత్సాహం మరువలేను

భారతి కుమారుడు రాజేష్

అమ్మా నాన్న ఇద్దరూ ఉద్యోగులు కావడంతో నేను ఎక్కువగా పాలకొల్లులో ఉండి చదువుకున్నాను. మా అమ్మ ఉపాధ్యాయురాలు కావడంతో చదువు మీద ఏకాగ్రతతో పెంచారు. మా అమ్మకు వర్కింగ్ మైండ్ ఎక్కువ. చిన్నప్పటి నుంచి నాతో, మా చెల్లితో కాంపిటీషన్ పరీక్షలు రాయించేవారు. పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలోనే చదివాను. పోటీ పరీక్షలు రాయడం వల్ల నా చదువుకు, ఉద్యోగాలకు ఎంతో ఉపయోగపడింది. బిటెక్ చేసిన తర్వాత మాస్టర్స్ చేయాలనే ఆలోచన ఉంది. అప్పటికే పరీక్ష కూడా రాశాను. అయితే డబ్బు కోసం ఆలోచించి ఆగిపోదాం అనుకున్నాను. అనుకోకుండా హైదరాబాద్‌లో ట్రిపుల్ ఐటీ వచ్చింది. మా అమ్మ డబ్బు కోసం ఏమి ఆలోచించొద్దు అని భరోసా కల్పించింది. తర్వాత క్యాంపస్ ఇంటర్వ్యూలో టాప్ ప్లేస్‌లో సెలెక్ట్ అయ్యాను. ప్రస్తుతం గూగుల్‌లో వర్క్ చేస్తున్నాను. మా అమ్మ నా చదువులో, ఉద్యోగంలో, నా జీవితంలో అందించిన ప్రోత్సాహం ఎంత చెప్పినా తక్కువే.




ఉత్తమ విద్యాబోధన అభినందనీయం

ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి పిడిఎఫ్ అభ్యర్థి బి.గోపీమూర్తి

భారతి వేలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారు. విద్యార్థుల కుటుంబాల ఆర్థిక పరిస్థితి తెలుసుకుని, విద్యార్థుల మానసిక స్థితికి అనుగుణంగా విద్యను బోధించడంలో ఆమె దిట్ట. మండలంలో యుటిఎఫ్ అభివృద్ధికి, జిల్లా కమిటీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఎంఎల్‌సి ఎన్నికలు, యుటిఎఫ్ కార్యక్రమాలకు విరాళాలు అందించి ఆమె దాతృత్వం చాటుకునేవారు. ఉపాధ్యాయ జీవితంలో విద్యార్థులు, పాఠశాల అభివృద్ధికి, సమాజానికి భారతి అందించిన సేవలు ఎనలేనివి.

భారతితో నా జీవనయానం చిరస్మరణీయం

ఎదుటి వారికి సాయపడే గుణం ఎక్కువ - భర్త గొట్టుముక్కల రామభద్రరాజు



భారతితో జీవితం పంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను. భారతి ఒకపక్క ఉపాధ్యాయినిగా పనిచేస్తూనే మరోపక్క పిల్లలను చూసుకుంటూ కుటుంబ అభివృద్ధిలో భాగస్వామురాలైంది. అటు పాఠశాలలో బోధన, ఇంటికొచ్చిన తర్వాత ఇంటి పనులతో క్షణం తీరిక లేకుండా జీవితం సాగించింది. ఆమె అందించిన సేవలు ఎంత చెప్పినా తక్కువే. భారతితో నా జీవిత ప్రయాణం మరువలేనిది. ఎటువంటి మనస్పర్థలూ లేకుండా ముందుకు సాగాము. ఏనాడూ వెనుకకు తిరిగి చూడలేదు. ఎదుటివారికి సాయం చేసే గుణం భారతికి చాలా ఎక్కువ. ఎవరైనా ఆపదలో ఉన్నారంటే వాళ్లకు ఎంతోకొంత ఆర్థిక సహకారం చేయడం ఆమె గొప్పతనం. వివిధ సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలకు, వివిధ కార్యక్రమాలకు సైతం విరాళాలు అందిస్తుంటుంది. మన దగ్గర ఉన్నాయో.. లేదో చూసుకుని ఇవ్వాలి కదా అని నేనన్నా.. పర్లేదండి.. ఇచ్చేయండి తర్వాత చూసుకుందాం అంటుందే తప్ప, వచ్చిన వారిని ఉత్తి చేతులతో పంపించిన సందర్భం ఇప్పటి వరకు లేదు. మాకు ఉన్న దానిలో ఎదుటి వారికి సాయపడటం మా ఇద్దరికీ ఎంతో తృప్తినిస్తుంది.

కార్మిక నేతగా రామభద్రరాజు

పాలకోడేరుకు చెందిన గొట్టుముక్కల బుచ్చిరాజు, వెంకటసుబ్బమ్మ దంపతుల కుమారుడు రామభద్రరాజు. వీరిది వ్యవసాయ కుటుంబం. రామభద్రరాజు చిన్నతనంలో వారి తల్లిదండ్రులు కృష్ణా జిల్లా పోతుమర్రులో వ్యవసాయం చేసేవారు. ఐటిఐ చదివిన రామభద్రరాజు వేంద్ర డెల్టా పేపర్ మిల్లులో 1984లో సీనియర్ ఫిట్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. సుమారు 40 ఏళ్లు పని చేశారు. ఎఐటియుసి నాయకునిగా మూడేళ్లు పని చేసిన రామభద్రరాజు తర్వాత 1989లో సిఐటియులో చేరారు. సిఐటియు నేతగా జాయింట్ సెక్రటరీగా, ట్రెజరర్‌గా సుదీర్ఘ కాలం పాటు పనిచేశారు. కార్మికులకు జీతాలు, అగ్రిమెంట్లు, ప్రమోషన్లు వంటి సమస్యలపై పోరాటాల్లో అండగా నిలబడ్డారు. లోన్లు, పెండింగ్ సమస్యలపై జరిగిన ఆందోళనల్లో రామభద్రరాజుతోపాటు మరికొంతమంది కార్మికులను మూడు నెలలపాటు మిల్లుకు రాకుండా యాజమాన్యం అడ్డుకుంది. దీంతో సిపిఎం సీనియర్ నేత, కీర్తిశేషులు రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) అధికారులు, మిల్లు యాజమాన్యంతో మాట్లాడి సమస్యను చక్కదిద్దడంతో కార్మికులను తిరిగి పనిలో పెట్టుకున్నారు. కార్మికులకు అండగా నిలబడి వారి సమస్యల పరిష్కారానికి రామభద్రరాజు కృషి మరువలేనిది.

ప్రజాశక్తి

ఉపాధ్యాయిని వేగేశ్న భారతి ఉద్యోగ విరమణ ప్రత్యేక అనుబంధం

పశ్చిమగోదావరి జిల్లా

29, అక్టోబర్ 2024

Advt.feature



భావితరాల దిక్సూచి.. భారతి

- ఉపాధ్యాయినిగా పాలకోడేరుకు చెందిన వేగేశ్న భారతి ఎనలేని సేవలు
- 41 ఏళ్లుగా విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు
- భారతి కుటుంబ సభ్యులంతా ఉపాధ్యాయులే
- పుట్టింది చింతపర్రు.. మెట్టినిల్లు పాలకోడేరుతో ఎనలేని అనుబంధం
- పాఠశాల భివృద్ధికి.. విద్యార్థుల ఉన్నతికి నిరంతరం కృషి
- సమాజం పట్ల అవగాహన.. సామాజిక స్పృహతో ముందుకు

వృత్తిరీత్యా ఆమె ఒక సాధారణ ఉపాధ్యాయిని. అయితే ఆమె ఆలోచనా విధానం నారీమణులకు మణిహారం. పాఠ్యాంశాల బోధనతోనే ఆగకుండా విద్యాభివృద్ధికి సహకారం అందిస్తూ విద్యార్థుల ఉన్నతికి ఆర్థికంగా తోడ్పడి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేశారు. అక్కడితో ఆగిపోకుండా ఉపాధ్యాయుల సమస్యలు, సామాజిక అంశాలతోపాటు సమాజానికి ఏదో చేయాలనే భావన మదిలో నిలువెల్లా నింపుకున్నారు. సమాజం పట్ల అవగాహన, సామాజిక స్పృహ, బాధ్యత గల వ్యక్తిత్వం ఆమె సొంతం. ఆమె మరెవరో కాదు పాలకోడేరు గ్రామానికి చెందిన వేగేశ్న భారతి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ (స్కూల్ అసిస్టెంట్) ఉపాధ్యాయినిగా పని చేస్తున్న భారతి అంటే విద్యార్థులకు భయం.. విద్యార్థుల తల్లిదండ్రులకు మమకారం. తోటి ఉపాధ్యాయులకు డిక్టేటర్‌గా కన్పిస్తారు. అయితే చదువు విషయంలో రాజీ పడకుండా విద్యార్థులకు విద్యా ఫలాలు పూర్తిస్థాయిలో అందించి వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేయడంతో ఎంతోమంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రయివేటు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో స్థిరపడ్డారంటే ఆమె చలవే. 41 ఏళ్ల ఉద్యోగ ప్రస్థానంలో ఎన్ని సమస్యలు ఎదురైనా వాటిని చిరునవ్వుతో స్వీకరించి అనుకున్న లక్ష్యానికి చేరువైన ఆమెను మా మంచి టీచర్ భారతి అంటుంటారు. ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా భారతి తన జీవిత ప్రస్థాన విశేషాలను ప్రజాశక్తితో పంచుకున్నారు.

భారతి కుటుంబ నేపథ్యం

పాలకొల్లు మండలం చింతపర్రు గ్రామానికి చెందిన వేగేశ్న నరసింహరాజు, ఝాన్సీలక్ష్మీబాయి దంపతులకు భారతి 1962 అక్టోబర్ 20వ తేదీన జన్మించారు. ఆమెకు అన్నయ్య రామరాజు, తమ్ముడు శ్రీనివాసరాజు ఉన్నారు. తండ్రి నరసింహరాజు ఉపాధ్యాయునిగా పని చేయగా తల్లి లక్ష్మీబాయి గృహిణి. నరసింహరాజు కుమారులు, కుమార్తెను విద్యలో చక్కటి మార్గంలో తీర్చిదిద్దారు. వారు కూడా విద్యలో ముందు వరసలో ఉంటూ అందొచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ముగ్గురూ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా కొలువులు సాధించడం విశేషం. రామరాజు రిటైర్ అవ్వగా శ్రీనివాసరాజు ప్రస్తుతం ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు.

విద్యాభ్యాసం

భారతి ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకూ చింతపర్రు యుపి స్కూల్లో, 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ పాలకొల్లు మున్సిపల్ హైస్కూల్లో విద్య అభ్యసించారు. ఇంటర్ పాలకొల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివారు. అనంతరం టిటిసి శిక్షణ పొందారు. భారతి ప్రాథమిక విద్య, కళాశాల విద్య ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే సాగింది. కార్పొరేట్ పాఠశాలల్లో చదువుకునే స్తోమత ఉన్నప్పటికీ తమ కుటుంబ సభ్యులంతా ప్రభుత్వ ఉపాధ్యాయులు కావడం, ప్రభుత్వ విద్య గొప్పతనాన్ని అందరికీ తెలియజేయాలనే ముఖ్యోద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యభ్యసించారు. అయితే భారతి విద్యాభ్యాసం ఏడో తరగతి వరకూ తాతయ్య పెన్మెత్స మార్రాజు, అమ్మమ్మ వెంకటసుబ్బమ్మ ఇంటి వద్దే సాగింది. భారతికి అమ్మమ్మ, తాతయ్య అంటే ఎనలేని ఇష్టం. అయితే మార్రాజు ఆ గ్రామానికి సర్పంచిగా, వైద్యునిగా పని చేశారు. 1975లో భారతి ఏడో తరగతి చదువుతున్న సమయంలో 25 మార్కులకు 24 మార్కులు వచ్చాయి. దీంతో సర్పంచిగా ఉన్న మార్రాజు నేరుగా పాఠశాలకు వెళ్లి 'నీకు చెప్పడం రాలేదా.. మా మనవరాలికి చదవడం రాలేదా' అని ఉపాధ్యాయున్ని ప్రశ్నించడంతో అక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయులంతా ఒక్కసారిగా కంగుతిన్నారని భారతి ..2లో

భావితరాల దిక్సూచి.. భారతి

(మొదటి పేజీ నుంచి)

చెబుతుంటారు.

రామభద్రరాజుతో వివాహం

ఇంటర్ విద్య పూర్తయిన తర్వాత భారతి కుటుంబంలో విషాద ఘటన చోటుచేసుకుంది. చింతపర్రు సర్పంచిగా పని చేసిన భారతి తాతయ్య పెన్మెత్స మార్రాజు 1980 ఆగస్టులో ఆకస్మికంగా మృతి చెందారు. సెప్టెంబర్‌లో భారతికి టిటిసిలో సీటు వచ్చింది. శిక్షణ తీసుకుంటున్నప్పుడే మండల కేంద్రమైన పాలకోడేరుకు చెందిన గొట్టుముక్కల వెంకట బుజ్జిరాజు, వెంకట సుబ్బమ్మ దంపతుల కుమారుడు రామభద్రరాజుతో 1981 మే 21న వివాహమైంది. భారతి తర్వాత టిటిసి శిక్షణ పూర్తిచేసి 1983 సెప్టెంబర్ 1న ఎస్‌జిబిటి ఉపాధ్యాయినిగా కొలువు సాధించారు. భారతి దంపతులకు ఇద్దరు సంతానం. కుమారుడు రాజేష్, కుమార్తె గాయత్రి. రాజేష్ ఎంటెక్ చేసి బెంగళూరులో గూగుల్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా కోడలు రమాదేవి ఎంఎస్‌సి కంప్యూటర్స్ గోల్డ్ మెడలిస్ట్. కుమార్తె గాయత్రి కూడా ఎంసిఏ చేశారు. అల్లుడు జగదీష్ ఎంటెక్ చేసి బెంగళూరులో మైక్రోసాఫ్ట్‌లో ఉద్యోగం చేస్తున్నారు.

ఉపాధ్యాయినిగా 41 ఏళ్ల 2 నెలల సేవలు

1983 సెప్టెంబర్ 1వ తేదీన భారతి ఎస్‌జిబిటి ఉపాధ్యాయురాలిగా పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాల ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా బాధ్యతలు చేపట్టారు. అక్కడ రెండేళ్ళ పని చేశాక 1985లో లంకలకోడేరు ప్రాథమిక పాఠశాలలో, తర్వాత శృంగవృక్షం చినపేట స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో పని చేశారు. 1987లో పాలకోడేరు చినపేట ప్రాథమిక పాఠశాలలో నాలుగేళ్లపాటు పనిచేసిన తర్వాత పాలకోడేరు నంబర్ వన్ ప్రాథమిక పాఠశాలలో 11 ఏళ్ళు, పాలకోడేరు పెదపేట ప్రాథమిక పాఠశాలలో ఏడేళ్ల పాటు పని చేశారు. తర్వాత మోగల్లు హైస్కూల్లో అడహాక్ పోస్ట్‌లో పని చేశారు. 2009 జనవరి 31న స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొందారు. తర్వాత మోగల్లు, వేండ్ర, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వహించారు. అనంతరం పాలకోడేరు జెడ్‌పి హైస్కూల్లో 16 ఏళ్లపాటు పని చేశారు. భారతి ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి 41 ఏళ్ల రెండు నెలలపాటు ఉపాధ్యాయినిగా సేవలందించి అందరి మన్ననలు పొందారు.

పాలకోడేరుతో ఎనలేని అనుబంధం

భారతి పుట్టినిల్లు చింతపర్రు.. మెట్టినిల్లు పాలకోడేరుతో ఎనలేని అనుబంధం ఉంది. 41 ఏళ్ల రెండు నెలలు ఉపాధ్యాయురాలిగా పని చేస్తే 30 ఏళ్లపాటు పాలకోడేరులోనే ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడం విశేషం. గ్రామంలో వివిధ పాఠశాలల్లో పని చేసిన భారతిని విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు సొంత మనిషిలా భావిస్తారు. విద్యార్థులకు అన్నివిధాలా సహకారం అందించడంతోపాటు వారి తల్లిదండ్రులకు అనేక సూచనలు, సలహాలు అందిస్తూ భారతి వారితో మమేకమయ్యారు. దీంతో వాళ్లకు ఏ సమస్య వచ్చినా ఆమె వద్దకొచ్చి చెబుతుండటం విశేషం. దీంతో భారతికి పాలకోడేరుతో విడదీయలేని ఆత్మీయ బంధం పెనవేసుకుపోయింది.

ఆ కుటుంబ సభ్యులంతా ఉపాధ్యాయులే

భారతి కుటుంబ సభ్యులంతా ఉపాధ్యాయులే. వాళ్ల తాతయ్య దగ్గర నుంచి తండ్రి వరకూ ఉపాధ్యాయులుగా పని చేశారు. భారతి తండ్రి నరసింహరాజు, పెదనాన్న సత్యనారాయణరాజు, మేనమామలు దయానందరాజు, సోమరాజు, అన్నయ్య రామరాజు, తమ్ముడు శ్రీనివాసరాజు, పెద్ద తాతయ్యలు సత్యనారాయణరాజు, లక్ష్మీపతిరాజు, వియ్యంకులు నడింపల్లి రంగరాజు, పేరిచర్ల సీతారామరాజు ఇలా కుటుంబ సభ్యులందరూ విద్యాభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తుకు బంగారుబాటలు వేసే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారే. మేనమామలు దయానందరాజు, సోమరాజు ప్రధానోపాధ్యాయులుగా పని చేసి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు స్వీకరించారు.

అనుకోకుండా ఉపాధ్యాయురాలిగా

భారతికి చదువు అంటే ఎంతో మక్కువ. ఏ సబ్జెక్టులోనైనా క్లాస్ ఫస్ట్ ఉండాలనే లక్ష్యంతో చదివేవారు. ఆ విధంగానే క్లాస్ ఫస్ట్‌లో నిలిచేవారు. లెక్కలు సబ్జెక్టు అంటే భారతికి ఎంతో ఇష్టం. ప్రతి తరగతిలో వందకు వంద మార్కులు లెక్కల సబ్జెక్టులో సాధించేవారు. అయితే భారతి కుటుంబ సభ్యులు మాత్రం ఇంటర్మీడియట్లో సిఇసి గ్రూపులో జాయిన్ చేశారు. దీంతో అప్పటి గణితం ఉపాధ్యాయులు పురాణం శ్రీనివాసరావు, గోనాల సుబ్బారావు గణితం సబ్జెక్ట్ అంటే భారతికి ఇష్టం కదా మీరేంటీ సిఇసిలో జాయిన్ చేశారని కుటుంబ సభ్యులను అడిగితే ఆడపిల్లలకు పెళ్లి చేసేస్తాం కదా అని చెప్పారు. అయితే ఇంటర్ పూర్తయిన తర్వాత భారతి డిగ్రీ చదవాలని అనుకున్నారు. అయితే వాళ్ల నాన్న, మేనమామ టిటిసి శిక్షణకు శ్రీకాకుళం జిల్లా ఓమరవల్లి తీసుకెళ్లారు. అప్పట్లో రూ.60 స్టయిఫండ్ తీసుకుని ఏడాదిపాటు టిటిసి శిక్షణ పొందారు. తర్వాత ఉపాధ్యాయురాలిగా ఒక ఇంటర్వ్యూకు భారతి నాన్న, మేనమామ తీసుకెళ్లగా లోపలికి వెళ్లాక ఏం చెబుతావని భారతిని వాళ్లు అడగ్గా నన్ను బలవంతంగా తీసుకొచ్చారని చెబుతాను అని భారతి బదులిచ్చారట. అలా చెప్పకూడదని ఉద్యోగం వస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని భారతికి నచ్చజెప్పి ఇంటర్వ్యూకి పంపించారు. భారతి కుటుంబ సభ్యులు కూడా అంతా ఉపాధ్యాయులు కావడంతో ఆరు నెలలు ముందుగానే సిలబస్ భారతికి బోధించడంతో ఉద్యోగానికి సహకారమైంది. ఈ విధంగా భారతి అనుకోకుండా ఉపాధ్యాయురాలయ్యారు. భారతికి గణితం ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సుబ్బారావు, హిందీ ఉపాధ్యాయులు శ్రావణరావు అంటే ఎంతో అభిమానం. ఉపాధ్యాయ వృత్తి చేపట్టేందుకు కుటుంబ సభ్యుల సహకారంతోపాటు ఈ ముగ్గురు ఉపాధ్యాయులు ఎంతో సహకరించారు.

రాజకీయాలకతీతంగా గ్రామాభివృద్ధే నా ఆకాంక్ష

వేగేశ్న భారతి, ఉపాధ్యాయురాలు

ఉపాధ్యాయురాలిగా పని చేయడం నాకు దక్కిన మంచి అవకాశం. ఒకవైపు కుటుంబాన్ని, మరోవైపు పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో విజయవంతమయ్యాను. 41 ఏళ్లపాటు ఉపాధ్యాయురాలిగా సేవలందించడం నా అదృష్టం. ఎంతోమంది చిన్న పిల్లలు నా దగ్గర చదువుకుని వివిధ ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థితిలో స్థిరపడడం నాకు ఎంతో గౌరవాన్ని ఇచ్చింది. ఇప్పటివరకూ ఉపాధ్యాయురాలిగా పాఠాలు బోధించిన నేను ఉద్యోగ విరమణ చేసినప్పటికీ తిరిగి మళ్లీ పాఠశాలకు వెళ్లి పాఠాలు బోధిస్తాను. విద్యార్థులకు ఇంకా పూర్తిస్థాయిలో సిలబస్ పూర్తికాలేదు. సిలబస్ అయ్యేంతవరకూ డిసెంబర్ చివర వరకు పాఠశాలకు వెళ్తాను. తర్వాత భవిష్యత్తుపై పెద్దగా ఆలోచనలేమీ పెట్టుకోలేదు. పిల్లలు కూడా అటువంటివేమీ పెట్టుకోవద్దని చెబుతున్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే ఆకాంక్షతో ఉన్నాను. సందర్భం ఏదైనా వేదిక మరేదైనా గ్రామాభివృద్ధికి తోడ్పడే అవకాశం లభిస్తే తప్పకుండా వినియోగించుకుని గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ఉన్నాను. దీనికి అందరూ సహకరిస్తే గ్రామాభివృద్ధి మరింత త్వరగా సాధ్యపడుతుందనేది నా ఆలోచన. ముఖ్యంగా నా జీవన ప్రస్థానంలో ఉద్యోగ బాధ్యతల్లో నా భర్త రామభద్రరాజు అందించిన సహకారం ఎప్పటికీ మరువలేను.



భారతి దాతృత్వం ఎనలేనిది

విద్యారంగం అభివృద్ధికి విద్యార్థుల ఉన్నతితో పాటు వివిధ ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థల పట్ల భారతి చాటుకున్న దాతృత్వం ఎనలేనిది. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పడమే కాకుండా విద్యలో వారికి ఆర్థిక తోడ్పాటు అందించడంలో ఆమెకు ఆమె సాటి అని చెప్పొచ్చు. గ్రామానికి చెందిన ఎంతోమంది విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందించారు. సాఫ్ట్‌వేర్లు, ఇంజినీర్లు, ఉపాధ్యాయులతోపాటు అన్ని ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లోని ఉద్యోగాల్లో స్థిరపడ్డారంటే వారిని తీర్చిదిద్దిన ఘనత భారతికే దక్కుతుంది. అలాగే పదో తరగతి విద్యార్థులకు ఏటా సొంత ఖర్చులతో స్టడీ మెటీరియల్ కూడా అందించేవారు. పాఠ్యపుస్తకాలు, నోట్స్‌లు ఇలా విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించారు. పాలకోడేరు జెడ్‌పి హైస్కూల్ అభివృద్ధికి రూ.50 వేలు అందించడమే కాకుండా ఇతర దాతల ద్వారా నిధులు సమీకరించి పాఠశాల అభివృద్ధికి దోహదపడ్డారు. ప్రజా సంఘాలకు, స్వచ్ఛంద సేవా సంస్థలకు, కళాకారులకు ఆర్థిక తోడ్పాటునందిస్తూ వస్తున్నారు.

యుటిఎఫ్‌లో ప్రముఖ పాత్ర

భారతి కుటుంబ సభ్యులంతా ఉపాధ్యాయులుగా పని చేయడం, వాళ్లంతా యుటిఎఫ్‌లో ఉండడంతో భారతి కూడా ఉపాధ్యాయినిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి యుటిఎఫ్‌లో కొనసాగుతున్నారు. యుటిఎఫ్ మండల బాధ్యతలు దగ్గర నుంచి సంఘం ఆధ్వర్యంలో జరిగే ప్రతి కార్యక్రమం, నిరసన, ఆందోళనలో ప్రత్యక్షంగా పాల్గొని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పాటుపడ్డారు. ప్రస్తుతం యుటిఎఫ్ జిల్లా కౌన్సిలర్‌గా కొనసాగుతున్నారు.

దేశమంటే ఎంతో గౌరవం

దేశ సరిహద్దుల్లో ఎముకలు కొరికే చలిలో తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా దేశ భద్రత కోసం ప్రాణాలర్పిస్తున్న ఆర్మీ అంటే భారతికి ఎనలేని గౌరవం. ఏటా పాఠశాలలో జరిగే టీచింగ్, లెర్నింగ్ సమావేశంలో జరిగే పవర్ ప్రజెంటేషన్‌లో ముందుగా ఆర్మీ జవాన్ల ఫొటో లేదా వీడియోగాని చూసి వారందిస్తున్న సేవలను గుర్తు చేసుకుంటున్నారంటే ఆర్మీ పట్ల భారతికి ఉన్న గౌరవ మర్యాదలు ఎటువంటివో అర్థం చేసుకోవచ్చు. ఉద్యోగ విరమణ సందర్భంగా రూ.లక్ష ఆర్మీకి ఫండ్ ఇవ్వాలనుకుని నిశ్చయించుకుని త్వరలో అందించేలా కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు.

– ప్రజాశక్తి, పాలకోడేరు

అమ్మా నాన్న.. ఎప్పుడూ నాకు సపోర్టుగానే ఉంటారు


భారతి కుమార్తె నడింపల్లి గాయత్రి



అమ్మానాన్న ఎప్పుడూ నాకు సపోర్టుగానే ఉండేవారు. మా అమ్మలో నాకు ఎక్కువగా నచ్చేది మా తాతయ్య వాళ్లను, అమ్మమ్మను, తాతాయ్యను చాలా బాగా చూసుకునేది. ఇంటిని ఎలా చక్కపెట్టాలి, ఎలా ప్లాన్ చేసుకోవాలి ఇలా అన్నీ అమ్మ నుంచే నేర్చుకున్నాను. నా చిన్నప్పటి నుంచి అమ్మ ఎంత బిజీగా ఉన్నా ఇంటిని చాలా నీట్‌గా ఉంచుకునేవారు. మా పిల్లల ఆరోగ్య విషయంలో ఆరోగ్య సూత్రాలు చెబుతుంటారు. ముఖ్యంగా పెద్దవాళ్లను ఎలా గౌరవించాలనేది అమ్మ నుంచే నేర్చుకున్నాను.

సమాజం కోసం ఎక్కువ ఆలోచిస్తారు

భారతి అల్లుడు నడింపల్లి జగదీష్



మా అత్తయ్య విద్య పట్ల ఎంతో శ్రద్ధ వహిస్తారు. విద్యార్థులకు ఏమి చెప్తే అర్థమవుతుంది, ఎలా చెప్తే అర్థమవుతుందని ఆలోచిస్తూనే ఉంటారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఏం చేస్తే బాగుంటుందని తరచూ మమ్మల్ని కూడా అడుగుతుంటారు. ఎక్కువగా సమాజం కోసం ఆలోచిస్తూ ఉంటారు. సమాజంలో ఏర్పడుతున్న సమస్యలు, విద్యారంగంలో అమలవుతున్న వ్యతిరేక విధానాలపై మాట్లాడుతుంటారు. ఈ విషయాలన్నీ నాకు బాగా నచ్చుతాయి.

అత్తయ్య నుంచి ఎంతో నేర్చుకున్నాను

భారతి కోడలు రమాదేవి



అత్తయ్య భారతి అంటే ఎంతో ఇష్టం. ఆమె నుంచి నేను ఎంతో నేర్చుకున్నాను. ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నప్పటికీ కుటుంబాన్ని సమర్థవంతంగా నడిపించారు. ముఖ్యంగా అత్తయ్య దేశ సంస్కృతీ సంప్రదాయాలకు ఎక్కువ ప్రాధాన్యతిస్తారు. అన్ని పండుగలను చాలా సంప్రదాయబద్ధంగా చేస్తారు. అది నాకు చాలా ఆదర్శంగా ఉంటుంది. పండగలను, పద్ధతులను బాగా పాటిస్తారు. అది మా అత్తయ్యలో నాకు బాగా నచ్చుతుంది. ఆమె నుంచి నేను చాలా నేర్చుకున్నాను.

మా నానమ్మ మమ్మల్ని ఎంతో బాగా చూసుకుంటారు

మనవరాలు మోక్షజ



మా నానమ్మ అంటే నాకు ఎంతో ఇష్టం. నన్ను, నాన్నని, అమ్మని, అన్నయ్యని అందరిని ఎంతో బాగా చూసుకుంటారు. నాయనమ్మలో దయ నాకు ఎంతో ఇష్టం. నాయనమ్మకు మొక్కలు, జంతువులు, పక్షులు అంటే ఎంతో ఇష్టం. ఇంట్లో పెంచుకునే జంతువులను, బయట పెరిగే జంతువులను నాయనమ్మ ఒకేలా చూస్తారు.

నాలెడ్జ్ పెంచేందుకు దోహదం

భారతి మనవడు కేదార్ వర్మ



మేము బెంగుళూరులో ఉంటాం. అక్కడే చదువుకుంటున్నాను. ఎప్పుడైనా సెలవులకు పాలకోడేరు వచ్చినప్పుడు నాయనమ్మ పనిచేసే స్కూల్ మొత్తం చూపించేవారు. ఖాళీ సమయంలో నాతో అనేక విషయాలు డిస్కస్ చేసేవారు. ఎలా ఉండాలి.. ఎలా చదువుకోవాలి. ఎలా గౌరవించాలి.. సొసైటీ పట్ల ఎలా ఉండాలి.. ఏ విధంగా సహాయపడాలో చెబుతుంటారు. అనేక అంశాల్లో ఆమె నా నాలెడ్జ్ పెంచేందుకు దోహదపడుతుంటారు.

నాకు నచ్చినవన్నీ కొనిపెడుతుంది

భారతి మనవరాలు నడింపల్లి యోగ్యత



అమ్మమ్మ నన్ను బాగా చూసుకుంటుంది. నాకు నచ్చినవన్నీ కొన్ని పెడుతుంది. అమ్మమ్మకు జంతువులంటే ఇష్టం. వాటిని బాగా చూసుకుంటుంది. అమ్మమ్మ సమయాన్ని బాగా ఫాలో అవుతారు. ఏ విషయంలోనైనా ఆలస్యం చేస్తే అసలు ఊరుకోరు. అన్నీ సమయానికి చేసుకోవాలని చెబుతుంటారు.

ఎడ్యుకేషన్‌లో డెడికేటెడ్‌గా, ఫ్యాషన్‌గా ఉంటారు

భారతి మనవడు నడింపల్లి మహాంత్‌వర్మ




అమ్మమ్మ ఎడ్యుకేషన్ విషయంలో చాలా డెడికేటెడ్‌గా, ఫ్యాషన్‌గా ఉంటారు. ఎలా అంటే నేను అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్లినప్పుడు స్టూడెంట్స్ హాలిడేస్, వీకెండ్స్‌లో ఇంటికి వస్తూ ఉంటారు. అప్పుడు మా అమ్మమ్మ స్టూడెంట్స్‌తో చాలాసేపు కూర్చుని ఎడ్యుకేషన్‌పై డిస్కషన్ చేస్తుంటారు. స్టూడెంట్స్, టీచింగ్ గురించి ఎక్కువగా ఆలోచిస్తూ ఉంటారు.

ఆదర్శ ఉపాధ్యాయురాలు భారతి

సేవా కార్యక్రమాలకు భారతి దంపతుల సహకారం అభినందనీయం

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం



భారతి ఆదర్శ ఉపాధ్యాయురాలు. పిల్లలకు మంచి బోధకురాలిగానే కాకుండా సమాజం పట్ల అవగాహన, బాధ్యత గల వ్యక్తి. ఆమె భాగస్వామిగా ఉన్న ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ ఆశయానికి, కర్తవ్యానికి అనుగుణంగా పని చేశారు. ఆమె భర్త జి.రామభద్రరాజు డెల్టా పేపర్ మిల్లు ఉద్యోగిగా, సిఐటియు అనుబంధ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్యకర్తగా కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై పని చేశారు. భార్యాభర్తలు ఇరువురూ పలు సందర్భాల్లో సేవా కార్యక్రమాలకు ఆర్థికంగా తోడ్పడుతూ సేవాదృష్టి కలిగి ఉండటం సంతోషకర విషయం. కుమార్తె, కుమారుడిని బాధ్యతతో పెంచి మొత్తం కుటుంబాన్ని చక్కగా తీర్చిదిద్దారు. భారతి తండ్రి నరసింహరాజు ఉపాధ్యాయునిగా పనిచేశారు. తల్లి ఝాన్సీలక్ష్మీబాయి గృహిణి. భారతి తాతయ్య కీర్తిశేషులు పెన్మెత్స మార్రాజు పాలకొల్లు మండలం చింతపర్రు గ్రామ సర్పంచిగా సిపిఎం తరపున చాలాకాలం పని చేశారు. నిజాయితీతో పని చేసి ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దారు. గ్రామ ప్రజలు, ఇతరుల మన్ననలు ఎంతగానో పొందారు. భారతి అమ్మమ్మ సుబ్బమ్మ, నానమ్మ అచ్చమ్మ కూడా మహిళా సంఘం కార్యకర్తలుగా పని చేశారు. భారతి పెద మేనమామ పెన్మెత్స దయానందరాజు, చిన మేనమామ పెన్మెత్స సోమరాజు ఉపాధ్యాయులుగా, ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి జిల్లా ఆదర్శ ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందారు. సోమరాజు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షునిగా, గౌరవాధ్యక్షునిగా ఉపాధ్యాయ ఉద్యమ బాధ్యతలు నిర్వహించి ఆదర్శవంతమైన కృషి చేశారు. భారతి వంటి ఉపాధ్యాయిని సమాజానికి అవసరం. దంపతులిద్దరూ భవిష్యత్తులో కూడా సామాజిక స్పృహతో సంఘ సేవా కార్యక్రమాలకు వారి సహకారం కొనసాగించాలని, వారి కుటుంబం ఆనందంగా ఉండాలని ఆకాంక్ష. భారతి, రామభద్రరాజుకు హృదయపూర్వక సామాజిక అభినందనలు తెలియజేస్తున్నాను.